క్లుప్తంగా

రేపు స్వేరో సమావేశం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గ స్వేరో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు లీడర్ శ్రీను తెలియజేశారు. సమావేశానికి స్వేరోలతోపాటు గురుకులాల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి స్వేరో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోస్గి వెంకటేశ్, దేవన్న, విజయ్ హాజరవుతారని తెలిపారు.

మండ్లవెంకటేశ్‌కు కృతిమ కాలు

జడ్చర్ల టౌన్: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన పట్టణానికి చెందిన మండ్ల వెంకటేశ్‌కు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సహకారంతో కృత్రిమ కాలు అమర్చినట్లు బాదం బజరంగ్, అంజి బుధవారం విలేకరులకు తెలియజేశారు. ఏడాది కిందట రోడ్డు ప్రమాదంలో మండ్ల వెంకటేశ్ కాలు కోల్పోయి నడవలేని స్థితిలో ఇంట్లో ఉండిపోయాడు. పరిస్థితిని గమనించిన తాము ధృవబాద్మి ద్వారా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సహకారంతో హైదరాబాద్‌లో బుధవారం ప్లాస్టిక్ కాలు అమర్చినట్లు వారు వెల్లడించారు.

ఆటోడ్రైవర్, గేయ రచయితకు సన్మానం



జడ్చర్ల టౌన్: స్థానిక ఆటో డ్రైవర్ గేయ రచయిత బొల్లె చెన్నయ్యను బుధవారం ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిగ్నల్‌గడ్డ ఆటోస్టాండ్ వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ హాజి మాట్లాతూ.. చెన్నయ్య రాసిన పార్లేజి బుగ్గలోడ పాట సక్సెస్ కావడం ఆనందంగా ఉందని, తమ ఆటోడ్రైవర్ గేయ రచయితగా మరింత ఎదగాలని సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హీరో బాంబే శ్రీనివాస్, దర్శకుడు జహీర్, ప్రొడ్యూసర్ షరీఫ్, పార్లేజీ బుగ్గలోడ బృందం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు నర్సింగ్ ఖాజా, వెంకటయ్య, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై వార్డు ఆఫీసర్లకు అవగాహన



భూత్పూర్: మున్సిపాలిటీలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై బుధవారం హౌసింగ్ ఏఈ జీఆర్ఎస్ కుమార్ వార్డు ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. పట్టణంలోని 10 వార్డులో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నమూనాలను ముగ్గు వేసి చూయించారు. బేస్‌మెంట్ లెవెల్, శ్లాబ్ లెవల్, రూఫ్‌లెవల్, యాప్‌లో క్యాప్చరింగ్ చేయు విధానంపై వార్డు ఆఫీసర్లకు ఏఈ అవగాహన కల్పించారు. యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారులకు డబ్బులు చెల్లించే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, విజయ్‌గౌడ్, సాయి, 10 వార్డులకు చెందిన వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

పాత భవనంలోనే నిర్వహించాలి

భూత్పూర్: మండల కేంద్రంలోని చౌరస్తాలో గతంలో విధులు నిర్వర్తించిన మండల వ్యవసాయశాఖ కార్యాలయం పాత భవనంలోనే నిర్వహించాలని సేవాదళ రాష్ట్ర కార్యదర్శి సంజీవరెడ్డి కోరారు. ఏఓ కార్యకలాపాలు రైతు వేదికలో నిర్వహిస్తుండంతో మండలంలోని వివిధ గ్రామాల రైతులకు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు చొరవ తీసుకొని పాత కార్యాలయంలోకి మార్చాలని కోరారు.

కార్యకర్తల కుటుంబానికి అండగా..



నవాబ్‌పేట: కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా నాయకుడు, ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన తల్లీ కుమారుల కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటంబాన్ని ఆదుకుంటామని వివరించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, వెంకటయ్య, యాదయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, అంబదాస్, బాలయ్య, నర్సింహులు తదితరులు ఉన్నారు.

స్టిచ్చింగ్.. 'ఆమె'కు ఆసరా

- యూనిఫామ్స్ కుట్టులో మహిళా సంఘాలు
- ఇప్పటికే ఒక జత సిద్ధం చేసి అధికారులకు అందజేత
- టార్గెట్‌ను విజయవంతంగా పూర్తి చేస్తున్న మండల సమాఖ్య



నవాబ్‌పేట మండల సమాఖ్య భవనంలో దుస్తులు కుడుతున్న మహిళలు



సిద్ధం చేసిన దుస్తులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

నవాబ్‌పేట: మహిళా సంఘాల సభ్యురాళ్లు ప్రతిసీజన్‌లో ఏదో ఒక వ్యాపారం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేసే యూనిఫామ్స్ స్టిచింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నారు. వచ్చిన ఆదాయంతో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. అధికారులు నిర్దేశించిన టార్గెట్‌ను విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసేందుకు అధికారులకు అందజేసి ఔరా అనిపించారు.

❖ మండలంలో 91 ప్రభుత్వ పాఠశాలలకు 4,680 మంది విద్యార్థులున్నారు. వారందరికీ దుస్తులు కుట్టేపనిని మండలంలో ప్రభుతం మహిళా సంఘాలకు ఇచ్చింది. దీంతో గతనెలలో ప్రారంభించి దుస్తులు కుట్టే కార్యక్రమం పూర్తి చేశారు.

❖ జతకు రూ.70 చొప్పున మహిళా సంఘాలకు చెల్లిస్తున్నారు. కాగా వాటిలో కటింగ్ ఇతర పనులకు రూ.8 ఉంటోంది. వాటిని మహిళలు చేస్తే వారికి నేరుగా జతకు రూ.70 ఇస్తారు. లేకుంటే కటింగ్ వేరేచోట, ఇతర చేతి పని వేరేచోట చేస్తే రూ.8 కట్‌చేసి రూ.62 ఇస్తున్నారు.

15గ్రామాలు 150 మందికిపైగా మహిళలు

మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో పదిమంది మహిళలు వారి సొంత కుట్టు మిషన్లు తెచ్చుకొని దుస్తులు కుడుతున్నారు. రోజుకు ఒక్కరు 6 జతలకు తగ్గకుండా కుట్టేస్తున్నారు. వీరితోపాటు మరో 15గ్రామాల్లో 150కిపైగానే మహిళలు దుస్తులు కుట్టే పనిలో నిమగ్నమయ్యారు. కాగా రెండో జత సైతం సిద్ధం చేయాలని ప్రభుత్వం ముడిసరుకును పంపించగా.. వాటిని కూడా త్వరలో కుట్టే పనిని ప్రారంభించనున్నారు.

> **ఇచ్చిన పనిని పట్టుదలతో..**
>
> ప్రభుత్వం గతంలో సీతాఫల్ ప్రాజెక్టు, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్లు ఇచ్చింది. అలాగే కరోనా సమయంలో మాస్కులు కుట్టాం. తాజాగా విద్యార్థుల దుస్తులు కుట్టే పని ఇచ్చింది. ఇచ్చిన టార్గెట్ ప్రకారం బడులు తెరిచేలోగా పూర్తిగా వందశాతం కుట్టాలని చెపారు. దానికి అనుగూనంగానే దుస్తులు కుడుతున్నాం. టార్గెట్ ప్రకారం పూర్తిచేస్తాం. గతంలో బడులు తెరిచి నెలలు గడిచినా ప్రైవేట్ ఏజెన్సీలు విద్యార్థులకు దుస్తులు అందించలేదు. బాధ్యతగా పనిచేసి ముందుగానే విద్యార్థులకు అందించాం.
>
> – అనిత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

ఇచ్చిన మాట నిలబెట్టుకునేదే కాంగ్రెస్

- ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



మూసాపేటలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల: పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేదే కాంగ్రెస్ పార్టీ అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 255మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మంజూరు పత్రాలను అందజేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని విమర్శించారు. పదేళ్ల పాలనలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. తమ ప్రభుత్వం సొంత స్థలాల్లో ఇంటిని నిర్మించుకునే పేదలకు రూ.5లక్షల సాయం చేస్తామని ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని చెప్పారు. విడతల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. మంజూరైనవారు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. నిర్మాణం ప్రకారం దశలవారీగా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులను జమ చేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. అనంతరం హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ కృష్ణయ్య, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నాగార్జున్‌రెడ్డి, బగ్గి కృష్ణయ్య, బాలనర్సింహులు, గోవర్ధన్, రాంచందర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, నర్సింహారెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

పచ్చదనం.. పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పద్మావతీకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల: పచ్చదనం.. పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండగలమని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పేర్కొన్నారు. బుధవారం పద్మావతీ కాలనీలో చేపట్టిన ఒకమార్పు- అభివృద్ధికి మలుపు పేరుతో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఇంటితోపాటు కాలనీలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతిఇంటి వద్ద చెట్లు పెంచుకోవాలని పచ్చదనం ఉంటే ఆహ్లాదకరంతోపాటు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. రోడ్లపై చెత్తాచెదారం వేయొద్దని ఇంటిముందుకొచ్చే చెత్త బండ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంద రోజులపాటు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, సాహితి తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని రాణిపేట్‌లో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించి మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను రక్షించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయురాలు ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, విద్యార్థులు తల్లిదండ్రులు ఆంజనేయులు, మైమూద్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

- కలెక్టర్ విజయేందిర



యూనిఫామ్స్ నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర: భూ సమస్యలను పరిష్కరించడానికి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. సదస్సులో ఇచ్చిన ప్రతిఫిర్యాదుకు తప్పని సరిగా పరిష్కారం చూపాలని అధికారులు ఆదేశించారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన 48ఫిర్యాదులపై కలెక్టర్ విచారణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శరత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. యూనిఫామ్‌లు ఇవ్వలేదని విద్యార్థులు తెలుపడంతో ఐకేపీ ఏపీఎం రమణను పిలిచి వివరణ అడిగారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు.

కొత్త చట్టంతో భూసమస్యల పరిష్కారం

నవాబ్‌పేట: భూభారతి చట్టంలో రైతుల పాత సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం కొల్లూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. అనంతరం ఆమె ప్రజల నుండి వినతులు స్వీకరించారు. కాగా కొల్లూర్‌లో 21 వినతులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మొక్కల పంపిణీ



చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట జెడ్పీఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో నాటారు. జీవశాస్త్రం ఉపాధ్యాయుడు శివకుమార్ మొక్కల సంరక్షణ, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, శ్రీనివాస్, రాఘవేంద్ర, నరేందర్, పద్మజా, జయలక్ష్మి, సుజాతమ్మ, సీఆర్‌పీలు విజయసింహ పలువురు ఉన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పాలమూరు(హన్వాడ): ప్రభుత్వం మహిళా సమాఖ్యల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలతో అందిపుచ్చుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీపీఎం చెన్నయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలో సెర్ప్, అలీఫ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాంప్ ప్రాజెక్టు ద్వారా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చుదిద్దేందుకు ప్రోత్సాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హన్వాడ, మహ్మదాబాద్, గండీడ్, దేవరకద్ర, సీసీకుంట, మహబూబ్‌నగర్ రూరల్ మండలాలకు చెందిన దాదాపు 200 మంది మహిళలు హాజరయ్యారు. మహిళలకు ఆసక్తి ఉన్న వ్యాపారాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ర్యాంప్ సంస్థ ద్వారా రుణం, వ్యాపారరంగాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సభ్యురాలు మాధవి తెలిపారు. కార్యక్రమంలో అలీఫ్ సంస్థ మాధవి, ఆయా మండలాల ఏపీఎంలు, సీసీలు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు సీజ్

జడ్చర్ల టౌన్: పాఠ్యపుస్తకాలు, డైరీలు, బెల్టులు అనుమతి లేకుండా విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం శ్లోక బిర్లాస్కూల్‌లో ఆందోళన చేపట్టగా.. ఎంఈఓ మంజులాదేవి సందర్శించి వాటిని సీజ్ చేశారు. మండలంలోని శ్లోకబిర్లాస్కూల్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఓ జనరల్ స్టోర్‌లో విక్రయిస్తున్నారంటూ ఏబీవీపీ విద్యార్థులు వాటిని పట్టుకుని అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ అక్కడికి చేరుకుని పట్టుకున్న పాఠ్యపుస్తకాలను సీజ్‌చేసి ఎమ్మార్సీకి తరలించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాలు విక్రయించేందుకు మున్సిపల్ ట్రేడ్‌లైసెన్స్ పొందారా అంటూ ప్రశ్నించారు. అంతకుముందు ఏబీవీపీ నాయకులు శ్లోకస్కూల్‌కు వెళ్లగా.. యాజమాన్యం లోపలికి అనుమతించకపోవడంతో గోడదూకి వెళ్లారు. గదినిండా డైరీలు, బెల్టులు, పాఠ్యపుస్తకాలు ఉన్నట్లు డీఈఓకు ఫిర్యాదు చేయగా పరిశీలించాలని ఎంఈఓను ఆదేశించారు. పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఇదే తంతు కొనసాగుతుందని అన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీశ్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు శివ, విజయ్, పాండు, కృష్ణకాంత్, భరత్ డిమాండ్ చేశారు.

పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



నవాబ్‌పేటలో మధ్యాహ్న భోజనంపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

నవాబుపేట: పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని.. దీనికి మండల అధికారులు పర్యవేక్షణ చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. అనంతరం ఆయన మండల కేంద్రంతోపాటు పోమాల్ జీపీ కార్యాలయాల్లో రికార్డులు, నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల విషయంలో మండల అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. అన్నిపాఠశాలల్లో భోజనంతోపాటు దుస్తులు, పుస్తకాలు తదితర వాటిని పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యానాయక్, ఎంపీహెచ్ఓ భద్రునాయక్, ఏపీఓ జ్యోతి, సీఆర్‌పీ జనార్దన్, పంచాయతీ అధికారులు నరేశ్, లక్ష్మయ్య, జంగమ్మ తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

జడ్చర్ల టౌన్: కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పార్టీ అని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో బుధవారం నిర్వహించిన సీపీఎం శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రజాశక్తి మాజీ సంపాదకుడు స్వర్గీయ హన్మంతురావుకు నివాళులర్పించారు. శిక్షణ తరగతుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కురుమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులు, ఉద్యోగుల హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆరోపించారు. జూలై 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించి బుధవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈనెల 25న జిల్లా కేంద్రంలో భారీ కార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, ధన్వాడ రాములు, సాంబశివుడు పాల్గొన్నారు.

దేవరకద్ర: కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు దేవదానం డిమాండ్ చేశారు. బుధవారం దేవరకద్రలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమ్మె సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

మోటూరికి ఘననివాళి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రజాపోరాటాల్లో చురుకైన పాత్ర పోషించిన మోటూరి హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



స్టేషనరీ అందజేస్తున్న రజనీకాంత్‌రెడ్డి

అడ్డాకుల: విద్యాభివృద్ధికి దాతలు కృషిచేయాలని జీహెచ్‌ఎం నాగయ్య పిలుపునిచ్చారు. మూసాపేట మండలం పోల్కంపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ట్రాక్టర్ లోన్స్ సీనియర్ మేనేజర్ పుట్టమద్రి రజినీకాంత్‌రెడ్డి విద్యార్థులకు స్టేషనరీ వస్తువులను అందజేశారు. పదేళ్లుగా పదో తరగతి టాపర్లకు ఆర్థికసాయం అందజేయడంతోపాటు విద్యార్థులందరి పరీక్ష ఫీజును సొంతంగా చెల్లిస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నాడు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎం మాట్లాడుతూ.. ఏటా పేద విద్యార్థుల చదువులకు సాయం చేస్తున్న రజినీకాంత్‌రెడ్డి సేవాగుణాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, మధు, సూరి, నిరంజన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తుందని కురుమూర్తి స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌకుంట్ల మండలం ముచ్చింతలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు, అధికారులతో కలిసి ముగ్గుపరిచారు. పూజలుచేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, హౌజింగ్ ఏఈ రవికుమార్, పీఎస్ అంజలిదేవి, మార్కెట్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమిపూజ

దేవరకద్ర: మండలంలోని బస్వాయపల్లికి 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. బుధవారం భూమిపూజ పనులు ప్రారంభించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విక్రమ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలరాజు, గోవర్ధన్, శివ, శ్రీహరి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నవాబ్‌పేట: తమ పొలంలో విత్తనాలు వేస్తుంటే ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని తమపై దాడి చేశారని బాధితురాలు చింతలగారి అంజమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని దాయపంతులపల్లికి చెందిన అంజమ్మ బుధవారం పొలంలో విత్తనాలు వేస్తుంటే దాయాదులు అడ్డుకుని దాడి చేశారని, అలాగే గతంలో బాకీ ఉన్న డబ్బులు అడిగితే దాన్ని మనసులో పెట్టుకుని పొలం చెంత తమపై దాడి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంలో గ్రామానికి చెందిన యాదయ్య, యాదమ్మ తదితరులు కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొనగా.. వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

వికసిత్ భారత్ రచ్చబండ

మిడ్జిల్: మండలంలోని అయ్యవారిపల్లిలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడు తూ.. 11ఏళ్ల బీజేపీ సుపరిపాలన, కేంద్రం చేపట్టి న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నరేశ్‌నాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం మోడ్రన్ బస్టాండ్



కాకుంట్లలో బస్టాండ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్నేహితులు

దేవరకద్ర రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తమ స్నేహితుడి పేరుపై మిత్రబృందం మోడ్రన్ బస్టాండ్ ఏర్పాటు చేశారు. కౌకుంట్ల మండల కేంద్రంలో మోడ్రన్ బస్టాండ్ ఏర్పాటు చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కౌకుంట్లకు చెందిన వంశీకృష్ణ ఏడాది క్రితం హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన స్మారకార్థం మిత్రులందరూ కలిసి విరాళాలు పోగుచేసి గ్రామంలోని ప్రధాన కూడలిలో మోడ్రన్ బస్టాండ్‌ను ఏర్పాటు చేసి గ్రామపెద్దల సమక్షంలో బుధవారం ప్రారంభించారు. వినూత్నంగా ఆలోచించిన స్నేహమిత్ర బృందంను పలువురు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు పోస్టర్ల ఆవిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రముఖ మతగురువు హైదరాబాద్‌కు చెందిన షహెజాదే గౌసే ఆజం హజ్రత్ పీర్ సయ్యద్‌షా కాజిం పాష ఖాద్రీ రహెమతుల్లాఅలై 5వ ఉర్సు వేడుకలు ఈనెల 21వ తేదీన ఉంటాయని బజ్మె అంజుమనే ఖాద్రీయ కాజ్మియా జిల్లా అధ్యక్షుడు జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. షాసాబ్‌గుట్టలోని హజ్రత్ మర్దాన్‌అలీ దర్గా ఆవరణలో ఉర్సు పోస్టర్లను పీఠాధిపతి సయ్యద్ రజాక్‌షాఖాద్రీ, కొత్తకోటకు చెందిన మౌలానా ఆబిద్ హుస్సేన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఫ్రోజ్‌షా ఖాద్రీ, వాసిఫ్‌షా ఖాద్రీ, మీర్ షోయబ్‌అలీ, ఖాజామైనద్దీన్ ఖాద్రీ, ఇలియాజ్ ముజాహిద్ ఖాద్రీ, నజీర్‌అలీ, మొహసిన్ కాజ్మి, షేక్ ఖాజ, జీషాన్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.